

కదిలించిన చదువుల తల్లి కథనం

హర్టీసెట్ స్టేట్ 3 ర్యాంకర్ స్రవంతి చదువుకు మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. 8లో



వైభవంగా మోతీమాత జాతర

గిరిజనుల ఆరాధ్య దైవం మోతీమాత జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. మినీ మేడారముగా పిలిచే జాతరకు భారీగా గిరిజనులు తరలివచ్చారు. 8లో



పేదల సంక్షేమమే ధ్యేయం 9లో

పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గ్రామ రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు.

న్యూస్‌రీల్

ఫైవ్ స్టార్ బస్సులు ప్రారంభం



మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నుంచి లింగంపల్లికి ఫైవ్ స్టార్.. ఫైవ్ స్టేజీ పేరిట రెండు డీలక్స్ బస్సు సర్వీసులను గురువారం నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ నుంచి బయలుదేరే ఈ బస్సులు నిజాంపేట్, పెద్దశంకరంపేట, జోగిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు స్టేజీలలో మాత్రమే ఆగుతూ లింగంపల్లికి చేరుకుంటాయని తెలిపారు. తిరిగి ఆయా స్టేజీలలో నిలుస్తూ నారాయణఖేడ్ వస్తాయన్నారు. నారాయణఖేడ్ నుంచి ఉదయం 7, 9గంటలకు మధ్యాహ్నం 2, సాయంత్రం 4గంటలకు బస్సులు బయలు దేరుతాయని వివరించారు. ఐదు స్టేజీలలోనే నిలుస్తుండటం వల్ల ప్రయాణికులకు సమయం గణనీయంగా ఆదా అవుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహాయ ట్రాఫిక్ మేనేజరు ప్రవీణ్ కుమార్, పీఆర్వో పాండు, లైన్ ఇన్‌స్పెక్టర్ శరణయ్య స్వామి, కంట్రోలర్ శంకర్, టీమ్ డ్రైవర్ స్వామి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నేరం

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణంలో టైర్స్ కార్మికులకు ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టవిరుద్ధమని, విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులు అమ్మరాదన్నారు. ప్రజలకు మైక్ సెట్, ఐసీయూ, బ్యానర్లను ఉపయోగించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో పెద్దపల్లి జడ్జి పూజలు



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో పెద్దపల్లి జిల్లా సివిల్ కోర్టు జడ్జి అర్జున్ కుటుంబ సభ్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరను వైభవంగా నిర్వహించాలి

సదాశివపేట(సంగారెడ్డి): భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని చింతా ప్రభాకర్ స్వగృహంలో మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు మండల ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ ముత్కని అనంతమ్మరాములు, ఒగ్గు మల్లయ్యస్వామి, ఒగ్గు కొమురయ్యస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల విరేశం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మునిగే నవీన్‌కుమార్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

టాప్ -10లో పటాన్‌చెరు

పెరిగిన ఓటర్ల సంఖ్య

- అందోల్‌లో గెలుపోటములను నిర్ణయించేది మహిళలే
- ఓటరు తుది జాబితా విడుదల

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఓటర్ల సంఖ్య పరంగా చూస్తే పటాన్‌చెరు జిల్లాలోనే అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచింది. ఇక్కడ ఏకంగా 3.28 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇది రాష్ట్రంలోనే టాప్ - 10 నియోజకవర్గాల్లో పటాన్‌చెరు ఒకటిగా నిలిచింది. జీహెచ్‌ఎంపీ పరిధిలో ఉండే శేరిలింగంపల్లి, ఎల్‌బీనగర్ వంటి అతిపెద్ద నియోజకవర్గాల సరసన పటాన్‌చెరు కూడా చేరడం గమనార్హం. జిల్లాలో అతి తక్కువగా 2.04 లక్షల మంది ఓటర్లతో నారాయణఖేడ్ నిలిచింది. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం తుది ఓటర్ల జాబితాను గురువారం విడుదల చేసింది. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి జిల్లాలో మొత్తం 12,13,751 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 6,14,334 లక్షల మంది పురుషులు కాగా, మహిళా ఓటర్లు 5,99,366 మంది ఉన్నారు. మరో 51 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు 17,868

ఓటరు జాబితా ముసాయిదాను 2022 నవంబర్ 9న ప్రకటించారు. అయితే కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ఇలా సవరించిన తుది ఓటర్ల జాబితాను పరిశీలిస్తే జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,868 మంది ఓటర్లు పెరిగారు. 2022 నవంబర్ 9న ప్రకటించిన జాబితా ప్రకారం మొత్తం 11,95,883 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితా ప్రకారం 12,13,751 ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు.



యువ ఓటర్లు 9,822 మంది

- జిల్లాలో యువ ఓటర్లు మొత్తం 9,822 మంది ఉన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తొలిసారిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అత్యధికంగా సంగారెడ్డి నియోజకవర్గంలో 2,367 మంది యువకులు ఓటుహక్కును నమోదు చేసుకున్నారు.
- ఆందోల్ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించేది మహిళలే. ఇక్కడ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇక్కడ మొత్తం 2,26,107 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 1,14,077 మంది ఉండగా, పురుషులు 1,12,026 మంది ఉన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 1,018 మంది మహిళలు ఉన్నారు.
- సంగారెడ్డి నియోజకవర్గంలోనూ పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య స్వల్పంగా ఎక్కువ ఉంది. ఇక్కడ 1,07,619 పురుషులు కాగా, మహిళలు 1,07,750 ఉన్నారు.

అందోల్‌లోలో 65.6 శాతం ఓటర్లు

- ఆయా నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా అందోల్ నిలిచింది. ఇక్కడి జనాభాలో 65.6 శాతం మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. తర్వాత స్థానంలో సంగారెడ్డి నియోజకవర్గం 64 శాతం ఉంది.
- ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను గత ఏడాది 2022 నవంబర్ 9న ప్రకటించారు. కాగా ఆయా నియోజకవర్గాల్లో ఓటు హక్కు నమోదు కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అత్యధికంగా పటాన్‌చెరులో కొత్తగా 8,294 మంది హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 4,266 మంది కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అలాగే మరణించిన వారి పేర్లను కూడా ఈ జాబితా నుంచి తొలగించారు. ఇలా డ్రాఫ్ట్ జాబితాను సవరించిన అధికారులు తుది ఓటరు జాబితాను గురువారం ప్రకటించారు.
- ఫొటోలతో కూడిన ఈ తుది ఓటరు జాబితా కాపీలను అధికారులు అన్ని రాజకీయ పార్టీలకు అందజేశారు. అలాగే అన్ని నియోజకవర్గాల్లోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	నిష్పత్తి
నారాయణఖేడ్	1,03,336	1,00,701	6	2,04,043	975
అందోల్ (ఎస్సీ)	1,12,026	1,14,077	4	2,26,107	1,018
జహీరాబాద్ (ఎస్సీ)	1,21,292	1,18189	2	2,39,483	974
సంగారెడ్డి	1,07,619	1,07,750	13	2,15,382	1,001
పటాన్‌చెరు	1,70,061	1,58,649	26	3,28,736	933
మొత్తం	6,14,334	5,99,366	51	12,13,751	976

జనాభా వివరాలు

నియోజకవర్గం	మొత్తం జనాభా (2023 అంచనా)	పురుషులు	మహిళలు
నారాయణఖేడ్	3,26,576	1,63,865	1,62,711
అందోల్(ఎస్సీ)	3,44,907	1,68,396	1,76,512
జహీరాబాద్ (ఎస్సీ)	3,80,855	1,90,623	1,90,231
సంగారెడ్డి	3,36,345	1,69,667	1,66,678
పటాన్‌చెరు	5,43,605	2,85,802	2,57,803
మొత్తం	19,32,288	9,78,353	9,53,934

సంక్షేమాన్ని గాలికొదిలిన ప్రభుత్వం

ప్లేట్లు పట్టుకొని కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట ప్లేట్లు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): సంక్షేమ హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని ఎస్‌ఎఫ్‌ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేశ్ ఆరోపించారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్లేట్స్ పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమ్య, రమేశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. కాని సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మాత్రం మెస్ చార్జీలు పెంచడం లేదన్నారు. మెస్ ఛార్జీలు పెంచి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ దానిపైన ఊసే లేదన్నారు. ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులకు మూడేళ్లుగా ప్యాకెట్ మనీ రాని పరిస్థితి ఉందన్నారు. బీసీ కళాశాల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు చలితో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గురువారం నారాయణఖేడ్ మైనారిటీ గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో ఒక విద్యార్థి ఆస్పత్రిలో చేరాడన్నారు. ఇప్పటికైనా హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేశ్, సాక్షి, రేణు, శ్రీకాంత్, పాండు, నిఖిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: మన ఊరు - మన బడి కార్యక్రమం కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాజర్షిషాతో కలిసి మన ఊరు - మన బడి పనుల పురోగతి, ఎఫ్‌టీఓల జనరేట్, మోడల్ స్కూల్స్ పనుల పురోగతి, తదితర అంశాలపై విద్య, ఇంజనీర్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తయిన సివిల్ వర్క్సతో పాటు పెయింటింగ్, సంప్, టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, ఫ్లోరింగ్, ఫినిషింగ్, తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. మోడల్ స్కూల్స్‌లో చేపట్టిన పనులను ఈ నెల 13లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిందని, పనులను నాణ్యతతో త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యంపై పలు నియోజకవర్గాల ఈఈలు, డీఈల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చేవారం వరకు చూస్తానని, అప్పటికీ పురోగతి లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన పనులకు వెంటవెంటనే ఎఫ్‌టీఓలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠశాలలకు పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం సూచించిన కలర్ కోడ్ రంగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, డీఈలు, ఎంఈఓలు, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: బల్దియ పరిధిలోని డివిజన్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్ కాలనీలో రూ.16 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలోనే ఖేడ్ కళాశాల ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్రంలోనే నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం రూ.కోటితో ఆడిటోరియం, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, సిబ్బంది కృషి వల్ల విద్యార్థులు ఉన్నతులుగా ఎదుగుతున్నారన్నారు. కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసిందన్నారు. పనులు పూర్తయితే కళాశాల కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తయారవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్, నాయకులు ముజామ్మిల్, అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

నారాయణఖేడ్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఇటీవల టీఎన్‌జీఓస్ ఖేడ్ నూతన కార్యవర్గం ఎన్నికకాగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద శ్రీనివాస్, మహ్మద్ మస్కిన్, తదితరులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కంగ్టి మండలం నాగూర్ (బి) గ్రామానికి చెందిన ఇద్దరికి కల్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లికి చెందిన బోయిని రాజుకు సంబంధించిన రెండు పశువులు విద్యుదాఘాతంతో మృతిచెందగా పరిహారంగా మంజూరైన రూ.80వేల చెక్కును అందజేశారు.

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్: జిల్లాలో నేడు(శుక్రవారం) మంత్రి హరీశ్‌రావు పాల్గొననున్న కార్యక్రమాలన్నీ సక్రమంగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కార్యక్రమాలకు సంబంధించి ఇన్‌చార్జి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను అదనపు కలెక్టర్లకు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, డీపీఓ సురేశ్ మోహన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీ దేవి, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు నగేశ్, రమేశ్‌బాబు, పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

మంత్రి జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమ వివరాలను కలెక్టర్ శరత్ వివరించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాలులో జీఓ 58 కింద లబ్ధిదారులకు మంత్రి సర్టిఫికెట్లను పంపిణీ చేస్తారు. 11 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలోని మోతీమాత ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఝరాసంగం మండలం బిడెకన్నెలో రైతులను కలిసి మాట్లాడుతారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో పంప్ హౌజ్‌లు బంద్ చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు హెచ్చరించారు. గురువారం సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ కార్మికులు మిషన్ భగీరథ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పంప్ హౌస్‌లను బంద్ చేసి ఇంటింటికీ రక్షిత మంచినీటి సరఫరాను ఆపేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుతున్న మిషన్ భగీరథ పథకం సమర్థవంతంగా అమలు కావడం కోసం కార్మికులు ఎంతో కష్టపడుతున్నారని, జిల్లాలో ఏడు కాంట్రాక్టు ఏజెన్సీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆరోపించారు. కార్మికులకు ఇస్తున్న తక్కువ వేతనాలను కూడా సకాలంలో చెల్లించకుండా ఇబ్బందుకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సుధాకర్, రాములు, కృష్ణ, రాములు, వెంకటేశం, ప్రభాకర్, అనిల్, రవి పాల్గొన్నారు.



ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రతిష్ఠాత్మకంగా చర్చ సాగేనా?

అధ్వానంగా మారిన రోడ్లపై ప్రస్తావించే అవకాశం

- మన బడి పనుల పురోగతిపై జరగనున్న చర్చ
- నేడు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం
- హాజరు కానున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శుక్రవారం జరుగనున్న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చర్చ జరగనుంది. ప్రధానంగా 'మన ఊరు - మన బడి' పథకంపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు సభ్యులు పేర్కొంటున్నారు. అలాగే జిల్లాలో అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్ల సమస్యను సభ్యులు సమావేశం దృష్టికి తేవాలని భావిస్తున్నారు. మధ్యాహ్నం వరకు మాత్రమే జరుగనున్న ఈ సమావేశంలో ఎజెండాలోని ముఖ్యమైన అంశాలను మాత్రమే చర్చించాలని జెడ్పీ పాలకవర్గం భావిస్తోంది. ఈ జెడ్పీ సమావేశానికి మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

నత్తనడకన 'మన బడి పనులు'

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం మన ఊరు - మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా కొన్ని పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలని భావించారు. జూన్ నాటికే వీటిని సిద్ధం చేయాలని ప్రణాళికను రూపొందించారు. కానీ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మరో నాలుగు నెలల్లో ఈ విద్యా సంవత్సరం కూడా ముగుస్తుంది. ఇప్పటికైనా ఈ పనులను వేగవంతం చేయని పక్షంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులు కొత్త రూపును సంతరించుకునే అవకాశం లేకుండాపోతోంది. సివిల్ పనులతో పాటు, టాయిలెట్లు, కిచెన్‌షెడ్లు, ఫ్లోరింగ్, ప్రహరీలు, పెయింటింగ్‌లు ఇలా పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఈ పథకం పనుల ప్రగతిని సభ్యులు చర్చించే అవకాశాలున్నాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు!

జిల్లాలో గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. చాలా రోడ్లు మోకాళ్ల లోతు గుంతలు పడటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఎంఆర్ఆర్(గ్రామీణ రోడ్ల నిర్వహణ) కింద మంజూరైన రూ.23 కోట్ల పనులకు పంచాయతీరాజ్‌శాఖ ఇప్పటికే నాలుగు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ టెండర్ వేయకపోవడం గమనార్హం. అలాగే వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.71 కోట్లు మంజూరైనప్పటికీ, ఈ పనులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు జంకుతున్నారు. సీఎం కేసీఆర్ హామీలో భాగంగా మంజూరైన రూ.155 కోట్ల ఎస్‌జీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభమయ్యాయి. ఇలా గ్రామీణ ప్రాంత రోడ్ల పరిస్థితిపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురావాలని భావిస్తున్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం కొన్నా, అమ్మినా నేరమే



నర్సాపూర్‌లోని గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు

నర్సాపూర్: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమేనని టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు హెచ్చరించారు. ఆయన తన బృందంతో గురువారం ప్రభుత్వ సివిల్ సప్లయి గోదాంతో పాటు మండలంలోని నాల్గు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు బియ్యం రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తోందన్నారు. మండలంలోని నాలుగు రైసుమిల్లుల్లో తనిఖీ చేశారు. గోదాం, రైసుమిల్లులలో తనిఖీ చేసినపుడు ద్రోణాచార్యులు వెంట ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తహసీల్దార్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మంజీరా తీర ప్రజలను భయపెడుతున్న మొసళ్లు



నదీ ఒడ్డున సేద తీరుతున్న మొసలి (సర్కిల్‌లో..)

కొల్చారం(నర్సాపూర్): మంజీరా తీరా ప్రాంత ప్రజలను నదిలోని మొసళ్లు తరచూ భయపెడుతున్నాయి. గురువారం మండల పరిధిలోని తుక్కాపూర్ నదీ తీరంలో మొసలి కనబడటంతో పశువుల కాపరులు భయాందోళన చెందారు. మండల పరిధిలో పది గ్రామాల వెంట మంజీరా నది ప్రవహిస్తుంది. ఎగువ నుంచి ప్రవాహంలో కొట్టుకు వచ్చిన మొసలి పిల్లలు పెరిగి పెద్దవైనట్లుగా తీర ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. రెండు నెలల క్రితం తుక్కాపూర్ గ్రామపంచాయతీ సమీపంలోని నీటి గుంతలో మొసలి కనిపించింది. గొర్రెలు, మేకలను నదీతీరంలోకి తీసుకెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 13 మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో గురువారం హాజరు పరచగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ముత్యాలు మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): మద్యానికి బానిసైన వివాహితను కుటుంబ సభ్యులు మందలించడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుంది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం మనోహరాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన గౌరారం రవి, ముత్యాలు భార్యభర్తలు. కూలీ చేసుస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడున్నారు. కాగా భార్య ముత్యాలు (40) మద్యానికి బానిసైంది. బుధవారం తాగి ఇంటికి రావడంతో భర్త మందలించాడు. తాగిన మత్తులో ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం సాయంత్రం గ్రామ ఊర చెరువులో మహిళ మృతదేహం ఉన్నట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు అక్కడివెళ్లి చూడగా ముత్యాలుగా గుర్తించారు. కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

వైభవంగా మోతీ మాత జాతర

- జాతరలో భక్త జన సందోహం
- తరలివచ్చిన మూడు రాష్ట్రాల భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



మరిగమ్మ మోతీ మాత

జహీరాబాద్ టౌన్: గిరిజనుల ఆరాధ్య దైవంగా నిత్య పూజలందుకుంటున్న మరిగమ్మ మోతీ మాత జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. మినీ మేడారంగా పిలిచే జాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్రా నుంచి భారీ గా గిరిజన పుత్రులు తరలివచ్చారు. దీంతో పరిసరాలు జనంతో కిటికటలాడింది. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండాల నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండా ప్రాంతంలో శ్రీమరిగమ్మ మోతీ మాత మందిరం ఉంది. కోరిన కోరికలను అమ్మ తీరుస్తుందని అడవి పుత్రుల నమ్మకం. ఏటా రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తుంటారు. ఈ సారి ప్రారంభమైన జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొదటి రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మందిరం వద్ద జెండాను ఆవిష్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవైద్యం సమర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో యజ్ఞం నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోగల 54 తండాల బంజారాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్జున్ నాయక్, జాడిమల్కాపూర్, రాయిపల్లి తదితర తండాల విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వహకులు వారికి బహుమతులను అందచేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. మోతీ మాత జాతరకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ అటవీ పరిసర ప్రాంతం కిక్కిరిసిపోయింది. వాహనాల పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు టెంట్లు వేసుకున్నారు. అన్ని శాఖల అధికారులు అక్కడే ఉండి భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక మరుగు దొడ్లు నిర్మించారు. తాగునీరు, కరెంట్ సౌకర్యం కూడా కల్పించారు. జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

కంది పంటపై క్షేత్ర దినోత్సవం



కంది పంటను సందర్శించిన శాస్త్రవేత్తలు

జహీరాబాద్: కంది పంటపై డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. గురువారం మొగుడంపల్లి మండలం గొటిగార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేశ్ మాట్లాడారు. జిల్లాలో పత్తి, వరి తర్వాత కంది ప్రధాన పంటగా ఉందన్నారు. 90 వేల ఎకరాల్లో సాగులో ఉన్నట్లు తెలిపారు. ఏదైన పంటలో మంచి దిగుబడులు రావాలన్నా నాణ్యమైన విత్తనాల ఎంపిక ముఖ్యమన్నారు. కందిలో ఎండు తెగులు ప్రధాన సమస్యగా ఉంటుందన్నారు. ఈ తెగులు నివారణకు మందులు లేవన్నారు. ఐసీపీఎల్ 87119(ఆశ), ఐసీపీఎల్ 8863, డబ్ల్యూఆర్‌జీ 65, టీడీఆర్‌జీ-4(హనుమ) రకాలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది హనుమ రకం కంది విత్తనాలను కొంత మంది రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ రకానికి ఎండు తెగులు ఉధృతి చాలా తక్కువగా ఉందన్నారు. ఈ విత్తనాలు నిల్వ చేసి గ్రామంలో ఉన్న తోటి రైతులకు ఇస్తామని రైతులు నిర్ణయించారన్నారు. అనంతరం శనగ, కుసుమ, అల్లం తదితర పంటల గురించి శాస్త్రవేత్త స్నేహలత రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త సురేశ్ దగాడే, భూసార నిపుణుడు స్వామి, రైతులు నారాయణ, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



లాలు (ఫైల్)

దుబ్బాక: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్నల లాలు(40) పంటలు సాగు చేస్తున్నాడు. తనకున్న రెండు ఎకరాలల్లో వానాకాలం సీజన్‌లో వరి వేశాడు. చెరువు నిండటంతో పంట నీటి మునిగింది. గతంలో బతుకు దెరువు కోసం ఆటో ఇతర వాహనాలను కొన్నాడు. వాటిని విక్రయించి నష్టపోయాడు. మొత్తం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని ఇంట్లో చెప్పలేక తరుచూ మదన పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి ఇంటి వెనుక వేప చెట్టుకి ఉరి వేసుకున్నాడు. భర్త కనబడకపోవడంతో భార్య శ్యామల వెతుకుతుండగా ఇంటి వెనుక చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతుదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరస్తుడికి ఆరేళ్ల జైలు

రూ.15 వేల జరిమానా

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం తుపాకీ పేలి కలకలం రేపిన సంఘటనలో కోర్టు నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించింది. హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శ్వేతరెడ్డి వాదనలు విన్న తర్వాత నేరస్తుడు దేవుని సదానందంకు ఆరేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తుడికి శిక్ష పడేలా సహకరించిన కోర్టు కానిస్టేబుల్ వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్స్ శివప్రసాద్, రాజమల్లు, ఏఎస్ఐ స్వామిదాసును అభినందించారు. వీరికి త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు సీఐ వెల్లడించారు.

బైక్ ఢీ: వ్యక్తి మృతి



హరికృష్ణ (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): మోటర్ సైకిల్ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పాలమాకులలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలమాకులకు చెందిన ఓ మహిళ మరణించడంతో రాత్రి దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని కాల్వ వద్ద మైల తీసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కవ్వం అనిల్‌రెడ్డి బైక్‌ను వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఏటి హరికృష్ణ (36) తోపాటు గుండెల్లి ఎల్లయ్యను ఢీ కొట్టాడు. దీంతో హరికృష్ణ అక్కడికక్కడే మరణించగా ఎల్లయ్యకు గాయాలయ్యాయి. మృతుడి బావ దర్శనం యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): గజ్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి ఆచూకీ తెలియకుండాపోయింది. గౌరారం ఎస్సై సంపత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం చౌదరిపల్లికి బోండ్ల రమేశ్(28) టాటా ఏస్ వాహన డ్రైవర్. బుధవారం సాయంత్రం గజ్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు అతడి కోసం బంధువులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. గురువారం రమేశ్ భార్య ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే గౌరారం ఎస్ఐ ఫోన్ 94409 01839కు సమాచారమివ్వాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన దబ్బెట రమేశ్ వృత్తి రీత్యా డ్రైవర్. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తితో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వట్‌పల్లి(అందోల్): పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ అంబర్యా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మర్వెల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి 13 మంది పేకాటాడుతున్నవారిని పట్టుకున్నారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఐదు మోటరు సైకిళ్లు, రూ.28,610 నగదు స్వాధనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తరచు కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పట్టించుకోని అధికారులు



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న బాధిత రైతులు

గజ్వేల్‌రూరల్: వ్యవసాయ బోరుబావుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు భారం పడుతుండటంతో అది తరచు కాలిపోతుందని, అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోయారు. గజ్వేల్ మండలం బెజుగామ, ఆరెపల్లి(ఎస్‌బీ) గ్రామాలకు చెందిన 13 మంది రైతులు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ కోసం డీడీలు చెల్లించి గతంలో ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చుకున్నామని తెలిపారు. ఇటీవల కొందరు రైతులు ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుబావులకు కనెక్షన్ ఇవ్వడం వల్ల తరచూ కాలిపోయి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇదే విషయమై సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈకి ఫిర్యాదు చేసినప్పటికీ నామమాత్రంగా చర్యలు తీసుకుని వదిలి వేస్తున్నారని మండిపడ్డారు. తమ బోరుబావుల కోసం 13 మంది రైతులంతా కలిసి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పొందినప్పటికీ అదనంగా మరో తొమ్మిది మంది ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగిస్తుండడంతో అదనపు భారంతో ట్రాన్స్‌ఫార్మర్ 15 రోజులకోసారి కాలిపోతుందని, దీంతో తాము పంట నష్టపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అగ్నిప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధం

- అప్రమత్తం చేసిన బ్లూకోట్ సిబ్బంది
- ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం



కాలిపోతున్న దుకాణాలు

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని రోడ్డుపక్కన ఉన్న మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం హున్సెపాలియా బాయిలూర్‌కు చెందిన బసవన్న గత 12 సంవత్సరాలుగా సిద్దిపేట పట్టణం మెదక్ రోడ్డులో రిలయన్స్ మార్ట్ పక్కన దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. శీతాకాల ఉన్ని దుస్తులు విక్రయాస్తూ భారత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి బసవన్న షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. షాపులో మహేశ్, మహాదేవ్ నిద్రించారు. గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో ఆ రూట్‌లో బ్లూకోట్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది దుకాణం నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే దుకాణానికి వెళ్లి లోపల ఉన్న ఇద్దరిని అప్రమత్తం చేయడంతో బయటకు వచ్చారు. వారు వెంటనే యజమానికి సమాచారం ఇచ్చారు. అతడు వచ్చేసరికి అతడి దుకాణంతో పాటు, పక్కన ఉన్న సిద్దిరాజ్ దుకాణం దగ్ధమయ్యాయి. వీటితోపాటు షఫీకి చెందిన పండ్ల దుకాణం కూడా కాలిపోయింది. పానిపూరీ బండికి కూడా మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చలికాచుకోవడం కోసం మంట పెట్టుకుని ఆ మంటలను ఆర్పకుండా వెళ్లిపోవడంతో దుకాణాలు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు కాలిపోయిన దుకాణాలను పరిశీలించి ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేస్తున్న గిరిజనులు

కల్హేర్(నారాయణఖేడ్): అటవీ భూమి కబ్జా చేశారని తెలియడంతో అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై గిరిజనులు దాడి చేశారు. నిజాంపేట మండలం మునిగేపల్లి నాన్యనాయక్ తండాలో జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 415లో హరితహారం కింద అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. సంబంధిత భూమి కబ్జా చేస్తున్నారని నారాయణఖేడ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. తండాకు చెందిన కాట్రోత్ సక్రియనాయక్, అతని భార్య కేస్లిబాయి, కొడుకు జైపాల్ కలిసి బీట్ ఆఫీసర్ రాములుపై దాడి చేశారు. బీట్ ఆఫీసర్ రాములు తమను ఇబ్బంది పెడుతున్నాడని గిరిజనులు ఆరోపించారు. రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఎదుటే వారు దాడి చేశారు. కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఘటనపై విచారణ చేశారు. దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పశువుల అక్రమ పాకల తొలగింపు

ఏడెకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం



గూడెంలో పశువుల పాకలను తొలిగిస్తున్న అధికారులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం శివారు 361 సర్వే నంబర్‌లో అక్రమంగా వేసిన పశువుల పాకలను గురువారం అధికారులు తొలిగించారు.. సుమారు ఏడు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమి లేకపోవడంతో గ్రామంలో పల్లెప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, జిమ్ వంటివి అమలు చేయలేకపోతున్నట్లు గతంలో సర్పంచ్ దేవ రాజశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా వేసిన పాకలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీఓ రాము, ఎస్ఐ నరేశ్‌రెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి జేసీబీతో తొలగించారు. గ్రామ అవసరాల కోసం ఈభూమిని వినియోగించుకోవచ్చని తహసిల్దార్ తెలిపారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ మంత్రి బాబూమోహన్

జోగిపేట(అందోల్): బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అందోల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బాబూమోహన్ అన్నారు. గురువారం అందోల్ రామాలయంలో అందోల్ నియోజకవర్గ పాలక్ తుల ఆధ్వర్యంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థాగతంగా బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈనెల 7న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ సమావేశం ద్వారా బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. సమావేశానికి బూత్ కమిటీ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా సహ ఇన్‌చార్జి రామకృష్ణ, విస్తారక్ మహేశ్ జీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్ నిర్వాహకురాలిపై ..


- మున్సిపల్ సిబ్బంది దాడి
- పోలీసులకు ఫిర్యాదు
- దాడి అవాస్తవమన్న మున్సిపల్ కమిషనర్

తూప్రాన్: పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలో చికెన్ సెంటర్ నిర్వాహకురాలిపై మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ పేరుతో దుకాణంలోకి చొరబడి దాడికి పాల్పడినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు వినియోగంలో లేకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోతరాజుపల్లిలో చికెన్ సెంటర్‌లో తనిఖీ కోసం వచ్చిన మున్సిపల్ సిబ్బంది కవర్లతో పాటు తూకం వేసే రెండు త్రాసులను తీసుకెళ్లారు. అడ్డుకునేందుకు యత్నించడంతో మున్సిపల్ మహిళా సిబ్బంది తనపై దాడి చేసిందని జగ్గన్నగారి భానుమతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సిబ్బంది దాడి అవాస్తవం

మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించింది. అందులోనే మాంసం, చేపలు, కూరగాయలు విక్రయించే విధంగా ఏర్పాట్లు చేశాం. పోతరాజుపల్లికి చెందిన జగ్గన్నగారి భానుమతి, భర్త జితేందర్‌రెడ్డి నిబంధనలు ఉల్లఘించి చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మినహా, ఇతర ప్రాంతాల్లో విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలోనే చికెన్ సెంటర్‌లో త్రాసులు బ్బంది తీసుకువచ్చారు. సిబ్బందిపై ఉద్దేశ పూర్వకంగానే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇకపై నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – మున్సిపల్ కమిషనర్

కదిలించిన చదువుల తల్లి కథనం



చెక్కును అందిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సాక్షి ఎఫెక్ట్..

- హార్టీసెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్ సాధించిన స్రవంతి
- ఫీజు చెల్లించలేక తండ్రితోపాటు గొర్రెలనుకాస్తున్న వైనం
- సాక్షి కథనానికి స్పందించిన దాతలు
- రూ.3.44 లక్షల చెక్కు అందించిన జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

దుబ్బాకటౌన్: హార్టీ సెట్‌లో స్టేట్ 3 వర్యాంక్ సాధించింది. బీఎస్సీ హార్టీకల్చర్‌లో సీటు వచ్చినా రూ.5 లక్షల ఫీజు చెల్లించే స్థోమత లేక తండ్రితో పాటు మేకలు కాస్తోంది. డిసెంబర్ 4న సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లికి చెందిన గొల్లచిన్నోళ్ల స్రవంతి దయనీయమైన పరిస్థితిని సాక్షి వెలుగులోకి తెచ్చింది. సాక్షి కథనంతో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తో పాటు మానవతావాదులు చలించి ఆమె చదువుకు అండగా ఉంటామని ముందుకు రావడం తెల్సిందే. కౌన్సిలింగ్‌లో ఫీజు కట్టేందుకు రూ.50 వేలు ఎంపీ గతనెల 5న స్రవంతి ఇంటికి వెళ్లి అందజేశారు.

కలెక్టర్ చేతుల మీదుగా ..

స్రవంతి ఉన్నత చదువుకు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. గురువారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ చేతుల మీదుగా రూ.3.44 లక్షల చెక్కును అందజేసింది. చేయూతనందించిన రైస్ మిల్లర్స్ అసోసియోషన్ సభ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. స్రవంతి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి

హార్టీసెట్‌లో స్టేట్ 3 వ ర్యాంక్ సాధించిన స్రవంతిని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులు, జిల్లా గర్వపడేల ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి హరీశ్, రైస్‌మిల్లర్స్ అసోసియోషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్,సెక్రటరీ బుచ్చయ్య, నాయకులు చింత రాజు, ప్రభాకర్, బాలకిరణ్‌రావు, శివకుమార్, కాశీనాథ్, రమేశ్, రాజేష్, రవిప్రకాశ్ పాల్గొన్నారు.